# ఎకరానికి రూ.15వేల రైతుబంధు ఇస్తామని మోసం



ఈటల రాజేందర్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

**మల్కాజ్‌గిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్**

కుత్బుల్లాపూర్: మల్కాజిగిరిలో జరిగిన రోడ్‌షోలో ప్రధాని నరేంద్రమోదీ పాల్గొన్న సమయంలో ''రాజేందర్ నువ్వు గెలిచి రా.. మల్కాజ్‌గిరిని అభివృద్ధి చేద్దాం..''అని ప్రధాని మాట ఇచ్చారని మల్కాజ్‌గిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గుర్తు చేశారు. కొంపల్లిలోని బొబ్బిలి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పైన పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు.

- ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి రూ.15 వేలు రైతుబంధు ఇస్తామని చెప్పి మోసం చేసిందని.. మహిళలకు ప్రతి నెల రూ.2,500 ఇస్తామన్న హామీ ఏమైందని ఈటల ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటే మరో రూ.40వేల కోట్లు కావాలన్నారు. అంత ఆదాయం ఎక్కడి నుంచి తీసుకొస్తారని ప్రశ్నించారు. తనకు ఓటు వేసి గెలిపిస్తే రాష్ట్ర ప్రభుత్వంతో కొట్లాడి స్థానిక సమస్యలను పరిష్కరిస్తానన్నారు. బీజేపీకి ఓటు వేసి గెలిపిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తామని పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకొచ్చేలా పనిచేయాలి



మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను సత్కరిస్తున్న నిజాంపేట్ కార్పొరేషన్ ప్రజాప్రతినిధులు

నిజాంపేట్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలను సాధిస్తుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శుక్రవారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డితో పాటు నిజాంపేట్ కార్పొరేటర్లు, నాయకులు శ్రీశైలంగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పార్టీలో చేరిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్‌లో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకు వచ్చేలా లోక్‌సభ ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ సీనియర్ నాయకుడు కొలన్ గోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు చిట్ల దివాకర్, సురేష్‌రెడ్డి, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జగన్‌యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, వెంగయ్య చౌదరి, జగదీష్ యాదవ్, మహిళా అధ్యక్షురాలు ఇందిర ఉన్నారు.

# ఆడుకుంటున్న చిన్నారిపై వీధి కుక్కల దాడి



గాయపడిన చిన్నారి అనన్య



వీధి కుక్కలను తరలిస్తున్న సిబ్బంది

దుండిగల్: వీధి కుక్కలు స్వైర విహారం చేశాయి. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి దుండిగల్ గ్రామంలోని కొరివి బస్తీకి చెందిన శ్రీలత కుమార్తె అనన్య(04) శుక్రవారం ఇంటి ముందు ఆడుకుంటుంది. ఈ క్రమంలో వీధి కుక్క ఒక్కసారిగా చిన్నారి తలతో పాటు ఒంటిపై తీవ్రంగా గాయపర్చింది. వెంటనే కుటుంబ సభ్యులు చిన్నారిని స్థానికంగా ఆస్పత్రికి తరలించారు. గతంలోనూ ఇదే విధంగా వీధి కుక్కలు పలువురిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా విషయం తెలుసుకున్న దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ వెంటనే స్పందించారు. బ్లూక్రాస్ సొసైటీ, మున్సిపల్ సిబ్బందిని పిలిపించి వీధి కుక్కలను పట్టుకున్నారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వీధి కుక్కల బెడద ఉంటే వెంటనే 9948795556, 9030095839, 9542715377 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.



సూరారంలోని కొత్తచెరువును పూర్తిగా పూడ్చివేసిన దృశ్యం

# ఇక్కడ చెరువు ఉండేది!

## మూడు నెలల్లో చెరువును పూడ్చేసిన వైనం

- గతంలో ఏడెకరాల విస్తీర్ణంలో కొత్త చెరువు
- మూడు నెలల క్రితం మూడెకరాల వరకు ఉన్న చెరువు ప్రాంతం
- నెలల వ్యవధిలో చెరువును మింగేసిన భూబకాసురులు
- ప్రస్తుతం చెరువు ఉన్నట్లు చూపిస్తున్న గూగుల్ మ్యాప్



గతేడాది నవంబర్ 11వ తేదీన గూగుల్‌మ్యాప్ కొత్త చెరువు దృశ్యం



మూడు నెలల క్రితం చెరువు ఇలా..

సుభాష్‌నగర్: ప్రజా అవసరాల నిమిత్తం మన పూర్వీకులు నిర్మించిన ఆ చెరువు చరిత్ర గత ఏడాది వర్షాకాలం 2023తో ముగిసింది. ఇక వచ్చే వర్షాకాలంలో ఆ చెరువు లేనట్టే. సరిగ్గా మూడు నెలల క్రితం అక్కడ చెరువు ఉండేది. ప్రస్తుతం కనుమరుగయ్యింది. ఇదేదో మాయ అనుకుంటున్నారా... కబ్జారాయుళ్ల చేతుల్లో పడి చెరువు కాస్త ప్లాట్లుగా మారింది. ఇంత జరిగినా సంబంధిత అధికారులు అటువైపు పోయిన పాపన లేదు.

- సూరారం గ్రామం ఆనుకొని శ్రీకృష్ణ నగర్‌లోని సర్వే నం.23లో 7 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొత్త చెరువును కొంతమంది మూడు నెలల వ్యవధిలో పూడ్చి వేశారు. మూడు నెలల క్రితం నీటితో ఉన్న ఈ చెరువు స్థలంలో ఇప్పుడు ప్లాట్లను నిర్మించారు. స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి భవిష్యత్ తరాలకు ఉపయోగపడాల్సిన ఆ చెరువునే కబళించేశాడని స్థానికులు చెబుతున్నారు.

**చెరువు నేపథ్యం..**

సూరారం గ్రామం ఆనుకొని సర్వే నంబర్.23లో ఏడెకరాల విస్తీర్ణంలో కొత్తచెరువు ఉండేది. స్థానికంగా వ్యవసాయనికే కాకుండా తాగునీటి అవసరాలకు ఎంతగానో ఉపయోగపడేది. నగరం విస్తరిస్తున్న తరుణంలో చెరువు చుట్టూ పలు బస్తీలు, కాలనీలు రావడంతో, కాలక్రమేణ కబ్జారాయిళ్లు చెరువును పూడ్చి వేస్తూ, ప్లాట్లుగా చేసి లక్షల సంపాదించారు. ప్రస్తుతం 3 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువును సైతం మూడు నెలల వ్యవధిలో పూడ్చివేసి ప్లాట్లుగా చేశారు.

**దిగువ ప్రాంతాలకు ముప్పే...**

కొత్తచెరువు పూడ్చడంతో రానున్న వర్షాకాలంలో ఎగువ ప్రాంతం నుండి వచ్చే నీరు, దిగువ ప్రాంతానికి వెళ్లడంతో దానికన్నా ఉన్నవారికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. చెరువు ఉన్నప్పటికీ ఒక్కో సారి వరద వచ్చినప్పుడు దిగువ ప్రాంతాల వారు ఇబ్బంది పడాల్సి వచ్చేది. ఇప్పుడు చెరువు పూడ్చి వేయడంతో ఇక ప్రతి వర్షాకాలం ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే.

**మొద్దు నిద్రలో అధికారులు..**

చెరువును పూర్తిగా పూడ్చివేసిన సమయంలో అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం పై పలు అనుమానాలకు తావిస్తోంది. స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి సదరు స్థలం తనదే అంటూ తన వద్ద స్థలానికి సంబంధించిన పత్రాలు ఉన్నాయని దర్జాగా చెరువును పూడ్చి వేశాడు. గతంలో రికార్డుల్లో కొత్తచెరువు ఉండగా, అప్పట్లో కొంతమంది రికార్డుల నుంచి తొలగించి తమ పేర్లను ఎక్కించుకున్నారని స్థానికంగా ఉన్న వారు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం గూగుల్ మ్యాప్‌లో కూడా చెరువు ఉన్నట్లు చూపిస్తోందని పేర్కొంటున్నారు. కానీ అధికారులు మాత్రం ఎందుకు పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

# సిట్టింగ్ స్థానాన్ని కైవసం చేసుకుని సత్తాచాటాలి



కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం రాత్రి షాపూర్‌నగర్‌లోని శుభమ్ హోటల్‌లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశం జరిగింది. నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కె.ఎం.ప్రతాప్, ఎన్నికల పరిశీలకురాలు శోభారాణి తదితరులు హాజరయ్యారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించారు. సిట్టింగ్ లోక్‌సభ స్థానాన్ని తిరిగి కైవసం చేసుకుని పార్టీ సత్తా చాటాలన్నారు. ఆ దిశగా నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని సూచించారు. మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి, కుత్బుల్లాపూర్ బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్, డివిజన్ల అధ్యక్షులు, అనుబంధం సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# 17న సీతారాముల కల్యాణం

నిజాంపేట్: శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఈనెల 17న బాచుపల్లిలోని కేఆర్‌సీఆర్ హరితవనంకాలనీలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పేర్కొంది. ఉదయం 11.36గంటలకు కేఆర్‌సీఆర్ హరిత వనం కాలనీలోని మార్కెట్ సెంటర్‌లో జరిగే కల్యాణానికి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

# నేడు అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ

నిజాంపేట్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని శనివారం బాచుపల్లిలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని జైభీమ్ యూత్ అసోసియేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. సాయంత్రం 6.30గంటలకు జరిగే కార్యక్రమానికి అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, బ్లూ ఇండియా పార్టీ అధ్యక్షుడు ప్రసాద్‌గౌడ్, డీబీఎస్‌ఏ ప్రెసిడెంట్ శరత్ చామర్, దాసురామ్ నాయక్, సుదర్శన్ తదితరులు హాజరు కానున్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

# రేపు రక్తదాన శిబిరం

సుభాష్‌నగర్: మనం లైఫ్ సేవర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 14న రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చైర్మన్ శ్యామ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సుభాష్‌నగర్ డివిజన్ తెలుగుతల్లి నగర్‌లోని కమిటీహాల్‌లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం వరకు రక్తదాన శిబిరం కొనసాగుతుందన్నారు. యువత పెద్ద ఎత్తున పాల్గొని రక్తాన్ని దానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు.

# ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు శుభాకాంక్షలు



కుత్బుల్లాపూర్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని అత్యధిక స్థానాల్లో గెలిపించాలని ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు కోరారు. నాగర్‌కర్నూల్ పార్టీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి శుక్రవారం శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్‌ను ఆయన సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్‌లో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తా



రంగారెడ్డినగర్: బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రంగారెడ్డినగర్ డివిజన్‌కు చెందిన రంగ శ్రీనివాస్‌గౌడ్ నియమితులయ్యారు. శుక్రవారం నగరంలోని బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు గందమల్ల ఆనంద్‌గౌడ్ చేతుల మీదుగా శ్రీనివాస్‌గౌడ్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలు ఓబీసీలకు అందజేసేలా చూస్తానన్నారు.



# అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



కమ్మరి మహిపాల్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ భాగ్యలక్ష్మి కాలనీకి చెందిన కమ్మరి మహిపాల్(39) వారం రోజుల క్రితం స్కూటీ నడుపుతూ ఓ బాలుడిని ఢీకొట్టాడు. ఈ ఘటనతో సొంత ఊరికి వెళ్లిన అతను బాలుడి వైద్య ఖర్చులు భరించేందుకు సిద్ధమైన మరలా ఇంటికి వచ్చాడు. అయితే బెట్టింగ్ అలవాటు ఉండటంతో అప్పులు ఎక్కువయ్యాయి. బాలుడికి ఏమవుతుందోనని ఆందోళన, మరో వైపు అప్పులతో ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్తాపానికి గురైన మహిపాల్ ఈనెల 11న సాయంత్రం 4గంటలకు ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి లక్ష్మణ(02), లలిత(07) ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# కేఎం ప్రతాప్‌ను కలిసిన మైనార్టీ నాయకులు



కేఎం ప్రతాప్‌ను కలిసిన రోడామేస్త్రీనగర్‌కు చెందిన మైనార్టీ నాయకులు

చింతల్: రంజాన్ పండుగను పురస్కరించుకుని మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్‌ను శుక్రవారం రోడామేస్త్రీనగర్-ఏకు చెందిన మైనార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. మహ్మద్ సలీం, అంజాద్‌ఖాన్, వాహీద్, అబ్దుల్ రిహాన్, ముస్తఫా, పాజిల్, సమీర్ తదితరులు ఉన్నారు.

# ఉత్సాహంగా సమ్మర్ నైట్ క్యాంప్



అక్షర స్కూల్‌లో జరిగిన సమ్మర్ నైట్ క్యాంప్‌లో బెలూన్‌లను షూట్ చేస్తున్న విద్యార్థి

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ సుచిత్రలోని అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం సమ్మర్ నైట్ క్యాంప్ ఉత్సాహంగా సాగింది. ఈ నైట్ క్యాంప్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య స్నేహభావం, అవగాహన ఏర్పడటంతో పాటు సంవత్సర పొడవునా పరీక్షలు, తరగతులతో తీరిక లేకుండా ఉన్న విద్యార్థులకు ఉపశమనం ఇచ్చింది. విద్యార్థుల సంగీత, సాహిత్య ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అక్షర విద్యాసంస్థల సీఈఓ మదన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు మధ్య స్నేహభావం పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం సమ్మర్ నైట్ క్యాంప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జానకి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా దేవాలయ వార్షికోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల గ్రామంలోని వేంకటేశ్వర శివ వీరాంజనేయస్వామి ఆలయ 20వ వార్షికోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి జరిగిన అభిషేకాలు, పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎమ్మెల్యే వివేకానంద్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నపూర్ణ సమేత విశ్వనాథుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని అభిలాషించారు. కార్పొరేటర్ రావుల శేషగిరి, బీఆర్‌ఎస్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, ఆలయ కమిటీ సభ్యులు జయరామిరెడ్డి, కృష్ణారావు, రాఘవేంద్రరావు, బీరప్ప, శ్రావణ్‌కుమార్, మహిపాల్‌రెడ్డి, ఆంజనేయులు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సునీతామహేందర్‌రెడ్డి విజయానికి కృషి చేయాలి



భూపతిరెడ్డిని కలిసిన కార్పొరేటర్లు

దుండిగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తాయని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. నిజాంపేట సీనియర్ నాయకులు కొలన్ గోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు చిట్ల దివాకర్, సురేశ్‌రెడ్డి, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డిలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. మల్కాజిగిరి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏనుగుల శ్రీకాంత్‌రెడ్డి, ఆవుల జగన్‌యాదవ్, వెంగయ్య చౌదరి, ఆవుల జగదీష్‌యాదవ్, నాగరాజ్ యాదవ్, ఇందిరా, శ్రీనివాస్‌గుప్తా, తలారి సాయి ముదిరాజ్, మధుసూదన్‌రెడ్డి, శ్రీహర్ష ఆమంచి, మురుగేశ్, ఉదయ్, సురేంద్ర కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

## యూజీసీ సభ్యుడిగా సచ్చిదానంద మహంతి

రాయదుర్గం: యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్(యూజీసీ) సభ్యుడిగా మూడేళ్ళ కాలపరిమితితో హెచ్‌సీయూ మాజీ ప్రొఫెసర్ సచ్చిదానంద మహంతికి అవకాశం కల్పించారు. మాజీ ప్రొఫెసర్, హెచ్‌సీయూలోని ఇంగ్లిష్ విభాగం అధిపతిగా ఆయన పనిచేశారు. భారత ప్రభుత్వం ఉన్నత విద్య మంత్రిత్వశాఖ నియమించింది. ఆయన జాతీయ, అంతర్జాతీయ అవార్డులను కూడా అందుకున్నారు. ప్రస్తుతం ఆయన పంజాబ్ యూనివర్సిటీ చండీఘడ్‌లో అరబిందో చైర్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు.ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

# సొంత గూటికి సాయికుమార్ పంతుల



ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ సమక్షంలో ఎన్‌ఎస్‌యుఐలో చేరిన సాయికుమార్ పంతుల

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి సాయికుమార్ పంతుల తన సొంత గూటికి చేరుకున్నారు. శుక్రవారం కొంపల్లిలో జరిగిన ఎన్ఎస్‌యూఐ రివ్యూ మీటింగ్‌లో రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ సమక్షంలో ఎన్ఎస్‌యూఐలో చేరారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ... గత 20 సంవత్సరాలుగా విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ వస్తున్నామని అన్నారు. తిరిగి సొంత గూటికి చేరడం సంతోషంగా ఉందన్నారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు జాన్, పృథ్వీ, రాకేష్, రాహుల్ యాదవ్, సందీప్ తదితరులు ఉన్నారు.



# మురుగు.. పరుగు

నిజాంపేట్: డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నిర్వహణ విషయంలో నిజాంపేట్ కార్పొరేషన్ పారిశుద్ధ్య విభాగం అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దీంతో పలు ప్రధాన రహదారులు, బస్తీల్లోని గల్లీల్లో తరచూ డ్రైనేజీ నీరు ఏరులై పారుతోంది. 21వ డివిజన్ సాయినగర్‌లో గత పదిహేను రోజులుగా మ్యాన్‌హోళ్లలో వ్యర్థాలు నిండిపోయి మురుగు రోడ్డుపైకి పారుతోంది. దీంతో స్థానికంగా దుర్గంధం నెలకొని ప్రజలు వాసనలు భరించలేకున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మ్యాన్‌హోళ్లను శుభ్రం చేయించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



సాయినగర్‌లో డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి రోడ్డుపై పారుతున్న మురుగు